సాక్షి రంగారెడ్డి

బుధవారం । 11 । అక్టోబర్ । 2023



యువత ఓట్లే కీలకం!

ఈసారి ఎన్నికల్లో యువత ఓట్లే కీలకం కానున్నాయి. కొత్తగా నమోదు చేసుకున్న వారి సంఖ్య భారీగా పెరిగింది. 10లో▸



బూత్ కమిటీలే కాంగ్రెస్ బలం

కాంగ్రెస్ పార్టీకి బూత్ కమిటీలు కొండంత బలమని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. 10లో▸



చేవెళ్ల: గోడలపై రంగులతో ప్రచార రాతల చెరిపివేత



కేశంపేట: చౌలపల్లి గ్రామంలో వాల్ పోస్టర్ల తొలగింపు



మీర్‌పేట: రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

కోడ్ కూసిన వేళ..

ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులు రాజకీయ ప్రచారాల పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ప్రభుత్వ వాహనాలపై నేతల ఫొటోలను తొలగించే పనులు చేపట్టారు. గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది, పట్టణాల్లో మున్సిపల్ సిబ్బంది మంగళవారం ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. గోడలపై రాతలకు రంగులు వేయించారు. పోస్టర్లు, రహదారుల పక్కన ఫ్లెక్సీలు తీసివేయించారు. అంబులెన్స్ వాహనాలపై ఉన్న కేసీఆర్ చిత్రపటాలకు టేప్‌లు వేసి కనిపించకుండా చేశారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు.



చేవెళ్ల: డివైడర్‌పై ప్రచార ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

న్యూస్‌రీల్

ఆ పోలీసుల తీరుపై ఆగ్రహం

విచారణకు ఆదేశించిన సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్: హైదరాబాద్–బీజాపూర్ జాతీ య రహదారిపై మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ పాత చౌరస్తా వద్ద ట్రాఫిక్ పోలీసుల కళ్ల ముందే రోడ్డు ప్రమాదం జరిగి ఓ మహిళ మృతి చెందడాన్ని చూసి అక్కడి నుంచి ట్రాఫిక్ పోలీసులు జారుకున్న తీరుపై పోలీసు ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించారు. 'కనికరం చూపని ఖాకీ' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. ప్రమాదం జరిగిన సమయంలో ట్రాఫిక్ పోలీసులు వ్యవహరించిన తీరుపై సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర విచారణకు ఆదేశించారు. ఘటనా స్థలంలో విధుల్లో ఉన్నది రాజేంద్రనగర్ ఎస్‌హెచ్‌ఓ బోస్ కిరణ్‌గా గుర్తించినట్లు సమాచారం.

షాద్‌నగర్‌కు అదనపు జిల్లా కోర్టు మంజూరు



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న న్యాయవాదులు

షాద్‌నగర్: అదనపు జిల్లా కోర్టును షాద్‌నగర్‌కు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మంగళవారం బార్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. షాద్‌నగర్‌కు అదనపు జిల్లా కోర్టును మంజూరు చేయించడంతో న్యాయసేవలు మరిన్ని అందుబాటులోకి వచ్చాయని పలువురు న్యాయవాదులు అన్నారు. ఇప్పటి వరకు జిల్లా కోర్టు సేవల కోసం మహబూబ్‌నగర్, రంగారెడ్డి కోర్టులకు వెళ్లేవారని తెలిపారు. స్థానికంగా జిల్లా అదనపు కోర్టు ఏర్పాటుతో ఈ ప్రాంతం వారికి ఎంతో వెసులుబాటు ఉంటుందన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తులు, హైకోర్టు రిజిస్ట్రార్, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ చొరవతో అదనపు కోర్టు మంజూరైందని అన్నారు. ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపిన వారిలో న్యాయవాదులు ఏజీపీ కంచి రాజ్‌గోపాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ రావు, న్యాయవాదులు మనోహర్‌రెడ్డి, సత్యనారాయణ యాదవ్, గుండుబావి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బంగారం, విదేశీ సిగరెట్ల పట్టివేత

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో ఇద్దరు వేర్వేరు వ్యక్తులు అక్రమంగా తీసుకొచ్చిన బంగారంతో పాటు కంబోడియా నుంచి అక్రమంగా తీసుకొచ్చిన విదేశీ సిగరెట్లను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం అర్ధరాత్రి రియాద్ నుంచి వయా మస్కట్ మీదుగా వచ్చిన ప్రయాణికుడు కస్టమ్స్ తనిఖీలు పూర్తి చేసుకుని ఎయిర్‌పోర్టు విలేజ్‌లోకి వచ్చాడు. అక్కడ అతడి ప్రవర్తనపై అనుమానం వచ్చిన నిఘా అధికారులు మరోసారి అతడి లగేజీని తనిఖీ చేయగా 317 గ్రాముల బరువైన రెండు బంగారు బిస్కెట్ల ముక్కలు, ఓ గొలుసు బయటపడింది. బంగారం విలువ రూ.18.17 లక్షలు ఉండవచ్చునని అధికారులు నిర్ధారించారు. అదే విధంగా మంగళవారం ఉదయం బహ్రెయిన్ నుంచి వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించి అధికారులు అతడిని తనిఖీ చేయగా మలద్వారంలో క్యాప్సుల్స్ రూపంలో బంగారం తీసుకొచ్చినట్లు గుర్తించారు. వైద్యుల పర్యవేక్షణలో నాలుగు క్యాప్సుల్స్‌ను బయటికి తీశారు. 782 గ్రాములు కలిగిన బంగారం విలువ రూ. 46.13 లక్షలుంటుందని అధికారులు నిర్ధారించారు.

విదేశీ సిగరెట్లు స్వాధీనం

సోమవారం అర్ధరాత్రి కంబోడియా నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికులను తనిఖీ చేయగా వారి వద్ద 1.17600 సిగరెట్లు లభ్యమయ్యాయి. వాటి విలువ 11.6 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. అక్రమంగా తీసుకొచ్చినందుకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పక్కాగా నిఘా



మొదలైన ఎన్నికల సందడి

- కోడ్ ఉల్లంఘిస్తే తప్పదు కొరడా
- ప్రతి పైసాకు లెక్క చెప్పాల్సిందే..
- ముమ్మరమైన పోలీసుల తనిఖీలు
- అభ్యర్థులు, అధికారులకు అగ్నిపరీక్ష
- ఏ మాత్రం తేడా వచ్చినా చిక్కుల్లో పడినట్లే..

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ఎన్నికల కోడ్ పోటీలో ఉన్న అభ్యర్థులనే కాదు సామాన్యులను కూడా ఇరకాటంలోకి నెట్టేయనుంది. భూముల క్రయవిక్రయాలు, బంగారం కొనుగోళ్లు, వాటి చెల్లింపుల విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా చిక్కుల్లో పడినట్లే. ప్రచార వేళలు మొదలు.. అభ్యర్థులు మాట్లాడే భాష, చేసే ఖర్చు ఇలా ప్రతి అంశాన్ని ఎన్నికల నిఘా వర్గాలు పక్కాగా లెక్కించనున్నాయి. ఎన్నికల ప్రవర్తన నియామావళిని ఏమాత్రం ఉల్లంఘించినా అభ్యర్థులపై బహిష్కరణ వేటు పడే అవకాశం లేకపోలేదు. జిల్లాలో భూముల క్రయవిక్రయాలతో పాటు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు ఎక్కువ. డబ్బు తరలింపు, చెల్లింపుల విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ఇబ్బందులు తప్పవు.

ఖర్చులపై ఆంక్షలు

అభ్యర్థుల ఎన్నికల ఖర్చు రూ.40 లక్షలుగా ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. నామినేషన్ దాఖలు చేసిన మొదటి రోజు నుంచి నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఆత్మీయ సమ్మేళనాలు, ప్రచార రథాలు, మద్యం పంపిణీ, ర్యాలీల్లో పాల్గొన్న కూలీలు, వారికి చెల్లించే మొత్తాలు, ప్రచార రథాలు, వాటికి చేసిన ఖర్చులు.. ఇలా ప్రతీది లెక్కించనుంది. అభ్యర్థులు ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాలు తెరిచి, ఆ ఖాతా నుంచే ఎన్నికల వ్యయ లావాదేవీలు నిర్వహించాల్సి ఉంది.

కీలకంగా 50 రోజులు

సోమవారం షెడ్యూల్‌విడుదల కావడంతో అన్ని రాజకీయ పార్టీలు అప్రమత్తమయ్యాయి. ఎన్నికలకు ఒక రోజు ముందే ప్రచార పర్వానికి తెర పడనుంది. ఈ నెలలో ఇంకా 21 రోజులే మిగిలి ఉన్నాయి. వచ్చే నెలలో 29 రోజులే. ప్రచారానికి ఈ 50 రోజులు కీలకంగా మారనున్నాయి.

రూ.50 వేలు దాటితే జప్తే..

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎక్కడికక్కడ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. సోమవారం సాయంత్రం గ్రేటర్ జిల్లాల్లో జరిపిన తనిఖీల్లో భారీగా నగదు సహా బంగారం పట్టుబడిన విషయం తెలిసిందే. రూ.50 వేల నగదు మించి వెంట తీసుకెళ్లే వారు విధిగా రసీదు సహా సరైన ఆధారాలను కచ్చితంగా చూపించాల్సి ఉంది. లేదంటే ఆ మొత్తాన్ని ఎన్నికల సంఘం జప్తు చేసే అవకాశం ఉంది. దసరా, దీపావళి వంటి పండుగలు, పర్వదినాలు, వివాహాలు ఇతర శుభకార్యాలకు భారీగా బంగారు, వెండి ఆభరణాలు కొనుగోలు చేస్తుంటారు. బంగారు ఆభరణాల కొనుగోలు రసీదులు మాత్రమే కాదు భూ క్రయవిక్రయాలు, చెల్లింపులకు సంబంధించిన పత్రాలు వెంట తీసుకెళ్లాల్సి ఉంటుంది. లేదంటే ఆ మొత్తాన్ని జప్తు చేసే ప్రమాదం లేకపోలేదు.

నిబంధనలు మీరితే ఉపేక్షించం

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హరీశ్ చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. నిబంధనలను అతిక్రమించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ మేరకు పలు సూచనలు చేశారు.

ఫిర్యాదులు ఇలా..

ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు రెండు రకాలుగా పంపొచ్చు. టోల్ ఫ్రీ నంబర్ 1950 ద్వారా చేస్తే, జీపీఆర్ఎస్ సాంకేతికతతో ఆ వ్యక్తి ఉన్న ప్రదేశం నుంచి ఫిర్యాదు అందుతుంది. సి.విజిల్ యాప్‌ను గత ఎన్నికల నుంచి అందుబాటులోకి తెచ్చారు. ఫొటోలు, వీడియోలు తీసి పంపాల్సి ఉంది. లైవ్ లొకేషన్ ద్వారా నిఘా బృందాలు అక్కడికి చేరుకుంటాయి.

వారికి ప్రత్యేకం

80 ఏళ్లు నిండిన వృద్ధులు, 40 శాతానికి మించి వైకల్యం ఉన్న వారికి ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పించింది. ఇందు కోసం 12డీ దరఖాస్తు ఫారాలు పంపిణీ చేస్తారు. నవంబర్ 8 నాటికి బూత్‌స్థాయి సిబ్బందికి అందించాల్సి ఉంది. పరిశీలించి ఓటు హక్కు కల్పించనున్నారు.

హోర్డింగ్‌ల తొలగింపు

కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లోని హోర్డింగ్‌లను 24 గంటల్లో.. బహిరంగ ప్రదేశాల్లో 48 గంటల్లో.. ప్రైవేటు ప్రదేశాల్లో 72 గంటల్లో తొలగించనున్నారు. ప్రైవేటు స్థలంలో ప్రచార హోర్డింగ్‌లకు సంబంధిత యజమాని అనుమతి పత్రం చూపితే వదిలేస్తారు.

ఆదర్శ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రతి నియోజకవర్గంలో ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేయబోతోంది. వీటిలో ఐదు మహిళా నమునా పోలింగ్ కేంద్రాలు ఉండనున్నాయి. ఇందులో ఉద్యోగులంతా మహిళలే ఉండనున్నారు. ఒకటి యువ అధికారులు, మరొకటి వైకల్యం కలిగిన వారికి ఏర్పాటు చేయనున్నారు.

సిద్ధమైన జిల్లా యంత్రాంగం

- ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది.
- ఇప్పటికే బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు తొలగించే పనిలో నిమగ్నమైంది.
- పోలీసులు ప్రధాన కూడళ్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, తనిఖీలు ముమ్మరం చేశారు.
- అధికారులు త్వరలో అన్ని రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, విధివిధానాలు వివరించనున్నారు.
- నిబంధనలను అతిక్రమిస్తే.. ఏ తప్పిదానికి ఎలాంటి శిక్ష ఉంటుందో తెలియజేయనున్నారు. అనర్హత వేటు పడే అవకాశంపై అవగాహన కల్పించనున్నారు.
- నిర్ణీత వ్యవధిలో ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారం చేయాలి.
- మసీదులు, దేవాలయాలు, చర్చిల్లో ప్రచారం నిషేధం.

బతుకుదెరువు కోసం వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం
- మృతులు మహారాష్ట్రలోని దాబా గ్రామస్తులు
- మొయినాబాద్ మండలం నజీబ్‌నగర్ సమీపంలో ఘటన



కారు ఢీకొనడంతో రోడ్డుపక్కన పడిపోయిన స్కూటీ

మొయినాబాద్: బతుకుదెరువుకోసం వలస వచ్చిన దంపతులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ సంఘటన మండల పరిధిలోని అమ్డాపూర్ రోడ్డులో ముర్తూజగూడ, నజీబ్‌నగర్ గ్రామాల మధ్య సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా గోన్పిపీరీ తాలూకా దాబా గ్రామానికి చెందిన పూర్ణిమ(23), ధర్మమేశ్రాం(35) దంపతులు. మూడేళ్ల క్రితం మొయినాబాద్ మండలానికి బతుకుదెరువుకోసం వలస వచ్చారు. పూర్ణిమ తండ్రి సుకాలు నాన్‌సింగ్ నిగ్‌వాక్ మండల పరిధిలోని ఎనికేపల్లి రెవెన్యూలో ఉన్న పికాక్ కంట్రీ ఫాంహౌస్‌లో పని చేస్తున్నాడు. పూర్ణిమ, ధర్మమేశ్రాం కూడా కొంత కాలం అక్కడే పనిచేసి మూడు నెలల క్రితం నుంచి అమ్డాపూర్‌లోని ఓ ఫాంహౌస్‌లో పనిచేస్తున్నారు. సోమవారం ఇద్దరూ స్కూటీపై పూర్ణిమ తండ్రి వద్దకు వెళ్లారు. రాత్రి 11.30 గంటల సమయంలో కాశీంబౌలి సమీపంలోని మల్లేశ్ ఫాంహౌస్‌లో జరిగిన సీరియల్ షూటింగ్ ముగించుకుని నగరానికి వెళ్తున్న సీరియల్ నటి కూన సరస్వతి, మరో నటి కారు(టీఎస్ 12 జెడ్ 4689)ను అతివేగంతో రాంగ్‌రూట్‌లో నడిపి ఎదురుగా వచ్చిన స్కూటీని ఢీకొట్టారు. భార్యాభర్తలు ఎగిరి రోడ్డుపక్కన ఉన్న ఫెన్సింగ్ వైర్, కడీలపై పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతివేగంతో కారు నడిపి ప్రమాదానికి కారణమైన సీరియల్ నటి సరస్వతిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇక రంగంలోకి దిగండి

- నగదు నిల్వలపై గట్టి నిఘా ఉంచాలి
- ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను ఉపేక్షించొద్దు
- ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి
- నోడల్ ఆఫీసర్లకు కలెక్టర్ హరీశ్ ఆదేశాలు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ హరీశ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నోడల్ ఆఫీసర్లతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. నగదు నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టోరల్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అబ్జర్వర్ల నియామకాల కోసం సరిపడా సిబ్బందిని గుర్తిస్తూ, ర్యాండమైజేషన్ ద్వారా నియామకాలు చేపట్టాలని పేర్కొన్నారు. కనీసం 20 శాతం మేర సిబ్బందిని రిజర్వులో సిద్ధంగా ఉంచాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ విధుల కోసం వేర్వేరుగా సిబ్బందిని నియమిస్తూ, ఎన్నికల విధుల పట్ల వారికి పూర్తి అవగాహన కల్పించేలా శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సరిపడా వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలని, పోలింగ్ సామగ్రిని సిద్ధం చేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించాలని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సత్వరమే నివేదికలు సమర్పించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను ఉపేక్షించకూడదని, అక్రమ మద్యం, నగదు నిల్వలపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో టాయిలెట్స్, ర్యాంపులు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించాలని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను మంగళవారం కలెక్టర్ హరీశ్ తనిఖీ చేశారు. గుర్తింపు పొందిన ప్రజా ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ సీల్ తెరిచి, యంత్రాలను పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదు లను పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అనుకోని రీతిలో ప్రమాదాలు సంభవించిన సమ యాల్లో తక్షణ చర్యలు చేపట్టేందుకు అవసరమైన అగ్నిమాపక సామగ్రి, ఇతర పరికరాలను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

పకడ్బందీగా తనిఖీలు

- శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున వాహనాల తనిఖీలను పకడ్బందీగా చేపట్టాలని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి సూచించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ టోల్‌ప్లాజా సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం ఏసీపీ రంగస్వామితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంషాబాద్ పరిధిలో నాలుగు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 24 గంటలు వాహనాల తనిఖీ కొనసాగుతుందని అన్నారు. చెక్‌పోస్టు మీదుగా వెళ్తున్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, రవాణాపై నిఘా మరింత పటిష్టం చేయాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం, బంగారం, వెండి, పేలుడు పదార్థాలు, మారణాయుధాలు వంటి వస్తువులను రవాణాచేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. తనిఖీల్లో పట్టుబడిన వాటికి సరైన ఆధారాలు చూపించాలన్నారు. తనిఖీల్లో అడిషనల్ డీసీపీ రాంకుమార్, పట్టణ సీఐ ప్రతాప్‌లింగం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

కొందుర్గు: ఎన్నికల నేపథ్యంలో జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును డీసీపీ నారాయణరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి ఆధారాలు లేకుండా ఎట్టి పరిస్థితుల్లో డబ్బులు, బంగారం రవాణ చేయకూడదని అన్నారు. పోలీసులు అప్రమత్తంగా ఉండాలని రూ. 50 వేలకు మించి తరలిస్తే సీజ్ చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రంగస్వామి, కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ ఎస్ఐలు కృష్ణయ్య, సక్రమ్ పాల్గొన్నారు.

అలయ్ బలయ్‌కి రండి

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ను మంగళవారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి రాజ్‌భవన్‌లో కలిశారు. ఈ నెల 25న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న అలయ్ బలయ్ ఉత్సవంలో పాల్గొనాలని ఆమెకు పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు.

నియంత పాలనకు త్వరలో విముక్తి

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీదే గెలుపు
- ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి



చల్లా వంశీచంద్‌రెడ్డి, నారాయణరెడ్డి, బాలాజీసింగ్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

ఆమనగల్లు: మరో 50 రోజుల్లో బీఆర్ఎస్ అవినీతి, నియంత పాలన నుంచి ప్రజలకు విముక్తి కలగనుందని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారెంటీ స్కీంలతో రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మండల పరిధిలోని రాంనుంతల గేటు వద్ద డీఎంకే ఫంక్షన్‌హాలులో మంగళవారం పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మూడుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నా నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా సాధించిన అభివృద్ధి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సాధించిన అభివృద్ధిపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

కల్వకుర్తి అభివృద్ధే లక్ష్యం

కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. ఎమ్మెల్సీగా తాను కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ 82 కాలువ ప్రారంభించి పనులను చేపట్టడం జరిగిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన జైపాల్ యాదవ్ ఒక తట్ట మట్టి తీయలేదని అరకిలోమీటర్ కాలువ పనులు పూర్తి చేయించలేకపోయారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొందపెడదామని నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ పిలుపునిచ్చారు. కేసీఆర్ ముందు మాట్లాడే ధైర్యం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు లేకుండా పోయిందని, బీఆర్ఎస్‌లో ప్రజాస్వామ్యం లేదని ఆరోపించారు. సమావేశంలో మాడ్గుల జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, ఆమనగల్లు, కడ్తాల ఎంపీపీలు అనిత, కమ్లి మోత్యానాయక్, ఆమనగల్లు, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, విజయ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడురి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీలే కాంగ్రెస్ బలం



కాంగ్రెస్ పార్టీ శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- వీటిని మరింత బలోపేతం చేస్తాం
- పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి
- 'పట్నం' బూత్ సభ్యులకు శిక్షణ శిబిరం
- బీఆర్ఎస్ పన్నాగాలను తిప్పికొట్టాలని పిలుపు

అబ్దుల్లాపూర్‌మెట్: కాంగ్రెస్ పార్టీకి బూత్ కమిటీలు కొండంత బలమని, వీటిని మరింత బలోపేతం చేస్తామని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, నాలుగు మున్సిపాలిటీలకు సంబంధించిన 319 బూత్ కమిటీల సభ్యులకు మంగళవారం పెద్దఅంబర్‌పేట తారా కన్వెన్షన్‌లో శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, పీసీసీ బూత్ ఎన్ రోల్ ట్రైనింగ్ కమిటీ కన్వీనర్ పవన్ మల్లాది దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికల్లో 'బూత్ స్థాయిలో పోల్ మేనేజ్‌మెంట్, ప్రచార వ్యూహం, ఓటర్ల కలయిక-పార్టీ పటిష్టత, సోషల్ మీడియా' తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చాలా పటిష్టంగా ఉందని, ఎన్ని ఆటంకాలు ఎదురైనా పార్టీ జెండాను భుజాన మోస్తున్న ప్రతి కార్యకర్తకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలు చాలా కీలకమైనవని, బీఆర్ఎస్ నాయకులు అధికార యంత్రాంగాన్ని ఉపయోగించుకుని దొడ్డిదారిన గెలవాలని చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పిలుపునిచ్చారు. త్వరలో నియోజకవర్గ సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి, అందరితో చర్చించి ప్రతి కుటుంబాన్ని కలిసి కాంగ్రెస్ పథకాలను వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండలస్థాయి నాయకులతో పాటు కాంగ్రెస్ ఎంపీపీలు.. జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు ఎంపీటీసీలు, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీ

షాద్‌నగర్ రూరల్: ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోంచి గుర్తు తెలియని దుండగులు పుస్తెలతాడు లాక్కెళ్లారు. ఈ ఘటన పట్టణంలోని బుచ్చిగూడ రోడ్డులో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. కేశంపేట మండలం పుట్టోనిగూడకు చెందిన పోతర్ల పద్మమ్మ సోమవారం తన కూతురు ఇంటికి వచ్చింది. మంగళవారం తిరిగి వెళ్లేందుకు బస్సు కోసం చటాన్‌పల్లి రైల్వేగేటు వద్దకు వచ్చింది. బుచ్చిగూడ వెళ్లే రహదారి పనులు జరుగుతుండటంతో రోడ్డును మూసి వేశారు. దీంతో కొత్తపేట వెళ్లే బస్సులు దూసకల్ బైపాస్ నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా బుచ్చిగూడ బ్రిడ్జి కింద నుంచి కొత్తపేట వైపు వెళుతున్నాయి. దీంతో పద్మమ్మ ఒంటరిగా నడుచుకుంటూ బుచ్చిగూడ రోడ్డు వైపు వెళ్తోంది. బాధితురాలిని అనుసరిస్తున్న దుండగులు బ్రిడ్జి వద్దకు రాగానే ఒకరు ఆమె మెడను పట్టుకోగా మరో వ్యక్తి ఆమె మెడలోంచి మూడు తులాల పుస్తెల తాడును లాక్కుని అక్కడి నుంచి పారిపోయారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

అక్రమ పార్కింగ్ .. జరిమానా

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారులు, అంతర్గత బస్తీలకు వెళ్లే ప్రాంతాల్లో అక్రమ పార్కింగ్‌ను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహగౌడ్ తెలిపారు. ఉప్పర్‌పల్లి చౌరస్తా నుంచి కోర్టుకు వెళ్లే రహదారి ఇరువైపులా అక్రమ పార్కింగ్‌తో నిత్యం ఇబ్బందులు కలుగుతున్నాయి. హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, దుకాణాల ముందు వాహనాలను అడ్డదిడ్డంగా పార్కు చేయడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందన్నారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఉదయం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. రామవత్ నాన్కి(38) తన అక్క కుమారుడు ఆకాశ్(20)తో కలిసి మీర్‌పేట నుంచి స్వగ్రామమైన మాడ్గుల మండలం దెబ్బగడ్డ తండాకు బైక్‌పై వెళుతున్నారు. స్థానిక టెలిఫోన్ కార్యాలయం వద్ద వెనుక వైపు నుంచి లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నాన్కి లారీ చక్రాల కింద పడి అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఆకాశ్ స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ప్రమాదం జరిగిన క్షణాల్లోనే లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బెల్ట్ షాపులపై దాడి

అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

ఇబ్రహీంపట్నం: బెల్ట్ షాపులపై దాడి చేసి అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచు చేసుకుంది. స్థానిక ఎస్ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపటేల్‌గూడ, పోచారం గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడులు జరిపినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 83 బీరు బాటిళ్లు, 240 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

శంషాబాద్ రూరల్: పోలీసులు బెల్టుషాపులపై దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంఘీగూడలోని కిరాణా దుకాణాల్లో మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. లావణ్య కిరాణా దుకాణం, పరమేశ్వర్ కిరాణా షాపులో బీరు, మద్యం బాటిళ్లు దొరికాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువత ఓట్లే కీలకం

- షెడ్యూల్ ప్రకటనతో వేడెక్కిన రాజకీయం
- భారీగా పెరిగిన ఓటర్లు
- కీలకంగా మారనున్న యువత



షాద్‌నగర్ మున్సిపాలిటీ

షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలకు సైరన్ మోగింది. షెడ్యూల్ ప్రకటనతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. అధికార బీఆర్ఎస్ పార్టీ ప్రచారంలో ముందంజలో ఉండగా కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థులే ఇంకా ఖరారు కాలేదు. ఈసారి యువత ఓట్లు కీలకంగా మారనున్నాయి.

షాద్‌నగర్ ఓటర్ల జాబితా

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ తుది ఓటర్ల జాబితాను ఇప్పటికే విడుదల చేసింది. అలాగే, పోలింగ్ కేంద్రాల గుర్తింపు పూర్తి అయ్యింది. నియోజకవర్గంలో మొత్తం 252 పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. పురుష ఓటర్లు 1,13,872 మంది, మహిళా ఓటర్లు 1,11,153 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 15 మంది, సర్వీసు ఓటర్లు పురుషులు 53, ఒక మహిళ ఉంది. నియోజకవర్గంలో మొత్తం 2,25,524 మంది ఓటర్లు ఉన్నారు.

పెరిగిన ఓటర్లు

నియోజకవర్గంలో కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాలతో పాటుగా షాద్‌నగర్ మున్సిపాలిటీ ఉంది. 2018 ఎన్నికల్లో మొత్తం 1,89,055 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం 2,25,524కు పెరిగింది. గతంలో కంటే ఈ సారి 36,469 మంది ఓటర్లు పెరిగారు. అలాగే, పోలింగ్ కేంద్రాలు గతంలో 242 ఉండగా ప్రస్తుతం 252కు పెరిగాయి.

యువత ఓట్లే కీలకం

ఈసారి ఎన్నికల్లో యువత ఓట్లు కీలకంగా మారనున్నాయి. కొత్తగా ఓటు హక్కు పొందిన వారిలో యువకులే అధికంగా ఉన్నారు. 19 నుంచి 39 ఏళ్ల మధ్య సుమారు 1,20,194 ఓటర్లు ఉన్నారు. అంటే ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాలో సగానికి కంటే ఎక్కువగా యువ ఓటర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలు యువతనే లక్ష్యంగా చేసుకొని ప్రచార పర్వాన్ని కొనసాగిస్తున్నాయి.

ప్రచారంలో బీఆర్ఎస్ ముందంజ

బీఆర్ఎస్ అధిష్టానం అభ్యర్థులను ఖరారు చేయడంతో ఆ పార్టీ ప్రచారంలో దూసుకెళ్తోంది. అంజయ్యయాదవ్ రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి, హ్యాట్రిక్ దిశగా వ్యూహాలు రచిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీల అభ్యర్థులను ఆయా పార్టీల అధిష్టానాలు ఇంకా ప్రకటించ లేదు. దీంతో బీఆర్ఎస్ కంటే ప్రచారంలో ఆ రెండు ప్రధాన పార్టీలు వెనకబడిఉన్నాయి.

చెక్ పోస్టుల ఏర్పాటు



ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో షాద్‌నగర్ అసెంబ్లీ పరిధిలో మూడు చెక్ పోస్టులు ఏర్పాటు చే శాం. నిబంధనలు అతిక్రమించి డబ్బులు, మద్యం, నగలు రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు.

– రంగస్వామి, ఏసీపీ, షాద్‌నగర్

రేషన్ బియ్యం పట్టివేత

14 క్వింటాళ్లు స్వాధీనం

యాచారం: అక్రమంగా తరలిస్తున్న 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం సాయంత్రం నక్కర్తమేడిపల్లి గ్రామంలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు పట్టుకున్నారు. సీఐ రామాంజనేయులు కథనం ప్రకారం.. కడ్తాల్ మండలం పల్లెచల్కతండాకు చెందిన ఇస్లావత్ రమేష్, శంకర్‌లు కొంత కాలంగా మంచాల, యాచారం మండల పరిధి గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి కడ్తాల్, ఆమనగల్లు తదితర ప్రాంతాల్లో ఉన్న పౌల్ట్రీఫాంలలో పనిచేసే కూలీలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రెండు వాహనాల్లో రేషన్ బియ్యాన్ని పల్లెచల్కతండాకు తరలిస్తున్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా నక్కర్తమేడిపల్లిలో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులకు బియ్యం తరలిస్తున్న రెండు వాహనాలు పట్టుబడ్డాయి. దీంతో వాహనాలతో పాటు, బియ్యాన్ని గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బియ్యం పట్టుకున్న విషయాన్ని పోలీసులు యాచారం తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మోగిన నగారా.. తొలగిన ఫ్లెక్సీలు

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- నిబంధనలు పాటించాలని సూచన



ఫ్లెక్సీలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మొయినాబాద్ రూరల్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం పచ్చజెండా ఊపింది. ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేయడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికల నిబంధనలు అమల్లోకి రావడంతో పంచాయతీ కార్మికులు, అధికారుల సూచనల మేరకు ఫ్లెక్సీలు, కటౌట్లు, బ్యానర్లను మంగళవారం ఉదయం నుంచి తొలగించారు. మండల పరిధిలోని బాకారం, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎన్కెపల్లి, అమ్డాపూర్, ముర్తుజాగూడ, కనకమామిడి, జాతీయ రహదారి డివైడర్లు, చౌరస్తాలో ఉన్న వివిధ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, కటౌట్లు, బ్యానర్లను తొలగిస్తున్నారు. గ్రామాల్లో పోస్టర్లను తొలగిస్తున్నామని ఎంపీఓ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని పాటించాలని అధికారులు సూచించారు.

నిబంధనలు అందరూ పాటించాలి

చేవెళ్ల: ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ ప్రచారాల పోస్టర్లు, ప్రభుత్వ వాహనాలపై రాజకీయ నాయకుల ఫొటోలను తొలగించేందుకు అధికారులు ఉపక్రమించారు. చేవెళ్ల మండల కేంద్రంలో మంగళవారం సిబ్బందితో గోడలపై వాల్ రైటింగ్స్, పోస్టర్లను తొలగించారు. ఎన్నికల నిబంధనలు అందరూ పాటించాలని అధికారులు సూచించారు.

ఆటోలో పట్టుబడిన రూ.6.55 లక్షలు

ఇబ్రహీంపట్నం: ఆటోలో తరలిస్తున్న రూ.6.55 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మంచాల ఎస్ఐ మారయ్య తెలిపిన వివరాల ప్రకారం... వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆరుట్లకు చెందిన కాసుల సురేశ్ ఆటోలో రూ.6.55 లక్షలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఈ మొత్తాన్ని అప్పగించినట్లు పోలీసులు చెప్పారు.

రూ.2.20 లక్షల నగదు సీజ్

చేవెళ్ల: రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. చేవెళ్ల మండలంలోని నాలుగు చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు. సోదాల్లో సోమవారం రాత్రి రూ.2.20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తాండూరుకు చెందిన భానుచందర్ అనే వ్యక్తి హైదరాబాద్‌కు వెళ్తుండగా ఈ నగదు పట్టుపడినట్లు పేర్కొన్నారు. నగదుకు సంబంధించి ఆధారాలు లేకపోవటంతో మంగళవారం తహసీల్దార్ కృష్ణయ్య సమక్షంలో సీజ్ చేసి ఎస్‌టీఓలో డిపాజిట్ చేసినట్లు తెలిపారు.

మేకలపై కుక్కల దాడి

కొందుర్గు: కుక్కల దాడిలో రెండు మేకలు మృతి చెందిన ఘటన మంగళవారం ఆగిర్యాలలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాములు గ్రామ శివారులోని మేకలను మేపుతుండగా కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో రెండు మేకలు మృతి చెందాయి. మేకల విలువ రూ. 20 వేల వరకు ఉంటుందని, తమను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం: గుర్తు తెలియని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ మారయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మంగల్‌పల్లి గ్రామ పరిధిలోని భారత్ ఇంజనీరింగ్ కళాశాల దగ్గర ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకున్న విషయాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలిలో మృతదేహాన్ని పరిశీలించారు. నాలుగైదు రోజుల క్రితం ఉరి వేసుకొని ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.